
ప్రజాశక్తి
గురువారం 3 ఏప్రిల్ 2025



జిల్లా మత్స్య శాఖాధికారిగా సంతోష్ కుమార్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా మత్స్య శాఖాధికారిగా టి.సంతోష్ కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఇప్పటివరకు జిల్లా మత్స్య శాఖాధికారిగా వి.తిరుపతయ్య కొనసాగిన విషయం విదితమే. జిల్లాలో మత్స్యకారులకు మేలు జరిగేలా చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా మత్స్య శాఖాధికారికి కలెక్టర్ సూచించారు.



కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న జిల్లా మత్స్యశాఖాధికారి సంతోష్‌కుమార్

గిరివెలుగు చుట్టూ అవినీతి చీకట్లు

- జీడి, చింతపండు ప్రాసెసింగ్ పేరుతో రూ.లక్షలు వృథా
- విడివికెల నిధులు దారి మళ్లించిన అధికారులు
- ఎపిడిపై విచారణ నీరుగార్చే యత్నాలు

గిరి వెలుగు ప్రాజెక్టు చుట్టూ అవినీతి చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఐటిడిఎ పరిధిలోని అన్ని గిరిజన మండలాల్లోని గ్రామాల్లో వన్‌ధన్ వికాస కేంద్రాల ద్వారా జీడిపప్పు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. వాటికి సంబంధించిన పరికరాలు, యంత్రాలు కొనుగోలు చేసి మూలన పడేశారు. విడివికెల ద్వారా జీడి పిక్కలు, చింతపండు, పసుపు కొనుగోలు చేసి ప్రాసెసింగ్ చేసిన తర్వాత విక్రయించినట్లు వెలుగు అధికారులు రికార్డుల్లో చూపించారు. వాస్తవంగా ఆ కార్యకలాపాలు ఎక్కడా జరిగిన దాఖలాలు లేవు.



వెలగవలసలోని జీడి ప్రాసెసింగ్ యూనిట్



మూలకు చేరి, తుప్పపట్టిన యంత్రాలు

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజనుల జీవనోపాధి కల్పన లక్ష్యంగా ఏర్పాటు చేసిన వన్‌ధన్ వికాస కేంద్రాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇబ్బడిముబ్బడిగా మంజూరైన నిధులను దారిమళ్లించారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రధానంగా గత కొన్నేళ్లుగా ఏజెన్సీలో ఏర్పాటైన వన్‌ధన్ వికాస కేంద్రాల ద్వారా జీడి, చింతపండు, పసుపు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు చూపించి, నిధులు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో దాదాపు అన్ని సబ్‌ప్లాన్ మండలాల్లోనూ జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. వాటిని వినియోగంలో పెట్టిన దాఖలాలు మాత్రం లేవు. జీడి ప్రాసెసింగ్ యూనిట్లలో యంత్రాలు, పరికరాలు ఇప్పటికీ తుప్పు పట్టి కనిపిస్తున్నాయి. సాలూరు మండలంలోని మరిపిల్లి పంచాయతీ వెలుగవలస, కురుకుట్టి గ్రామాల్లో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. వాటి కోసం పెద్ద గదిని తీసుకుని ప్రాసెసింగ్‌కి సంబంధించి కొనుగోలు చేసిన పరికరాలు, యంత్రాలు ఏర్పాటు చేశారు. ఇదే విధంగా అన్ని గిరిజన మండలాల్లోని గ్రామాల్లో జీడి ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. కానీ వాటిని వినియోగించినట్లు కనిపించలేదు. సుమారు రూ.60 లక్షల విడివికె నిధులతో జీడి ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించిన యంత్రాలు కొనుగోలు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా గిరి వెలుగు ప్రాజెక్టులో పనిచేస్తున్న మండల, గ్రామ స్థాయి అధికారుల పాత్ర ఉన్నట్లు కనిపిస్తోంది. ఆ యూనిట్లలో విడివికెలు సేకరించిన జీడి, చింతపండు, పసుపులను ప్రాసెసింగ్ చేసి ప్యాకింగ్ చేసిన తర్వాత మార్కెట్లో విక్రయించాలి. తద్వారా వచ్చిన లాభాలతో విడివికె సభ్యులు జీవనోపాధి మెరుగు పరుచుకోవాలనేది ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. అయితే కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా విడివికెల ద్వారా ఈ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్వహించిన సందర్భాలు లేవు.

విచారణ నత్తనడకన

2019 నుంచి 2024 వరకు గత ప్రభుత్వం హయాంలో విడివికెలకు మంజూరైన నిధులు దారిమళ్లించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గిరివెలుగు ఎపిడి సత్యంనాయుడు చుట్టూ ఆరోపణల ఉచ్చు బిగుస్తోంది. ఆయనపై జిల్లా కలెక్టర్‌కి, వెలుగు ప్రాజెక్టు రాష్ట్ర అధికారులకు అనేక ఫిర్యాదులు అందడంతో విచారణకు ఆదేశించారు. పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి ఈ వ్యవహారంపై విచారణ చేపడుతున్నారు. ఫిర్యాదుదారుడైన సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఇప్పటికే సబ్‌కలెక్టర్ విచారణకు హాజరై తన వాదనను వినిపించారు. అయితే ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎపిడి సత్యంనాయుడు కింద స్థాయి అధికారులు, ఉద్యోగుల ద్వారా ఫిర్యాదుదారులైన మహిళా సంఘం నాయకులపై ఒత్తిడి పెంచుతున్నారని తెలిసింది. ఎపిడి సత్యంనాయుడు మంచి అధికారి అని గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఒక మహిళా సంఘ నాయకురాలితో రాతపూర్వక స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు సమాచారం. ఈ గోల్‌మాల్ వ్యవహారంలో అప్పటి జిల్లా కలెక్టర్, వెలుగు ప్రాజెక్టు అధికారులు కూడబలుక్కుని అక్రమాలకు పాల్పడ్డారనే వాదనలు కూడా ఉన్నాయి. ఎపిడి సత్యంనాయుడుపై విచారణ నత్తనడకన సాగుతుండడం వెనుక ఒత్తిళ్లు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది.

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం

మంత్రి గుమ్మడి సంధ్యారాణి



రహదారిని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-పాచిపెంట

ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పాచిపెంట మండలం కేరంగి పంచాయతీ నందేడువలస - కోదివలస బిటి రోడ్డును మంత్రి బుధవారం ప్రారంభించారు. రూ.1.25 కోట్ల అంచనా వ్యయంతో రహదారి నిర్మాణం పూర్తి చేశారు. రహదారి నిర్మాణం వల్ల స్థానికులకు మెరుగైన రవాణా సదుపాయాలు అందించడంతోపాటు ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదం చేయనుందని మంత్రి తెలిపారు.

గిరిశిఖర పంచాయతీగా ఉన్న కేరంగి పంచాయతీ గత ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైందని, అక్కడి ప్రజలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామ సర్పంచ్, స్థానిక నాయకులు గతంలో అందించిన వినతులను పరిగణనలోకి తీసుకుని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ రహదారి నిర్మాణాన్ని చేపట్టిందని గుర్తుచేశారు. గిరిజన గ్రామాల అభివృద్ధి తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన విషయమని మంత్రి స్పష్టం చేశారు. మారుమూల గ్రామాల్లో మెరుగైన రవాణా, విద్య, వైద్యసేవలను అందించేందుకు ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని తెలిపారు. త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజలకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఐటిడిఎ ఇఇ ఎ.మణిరాజు, డిఇ బి.సంతోష్, జెఇ బి.సత్యనారాయణ, తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ బివిజె పాత్రో, సిడిపిఒ బి.అనంతలక్ష్మి, సాలూరు రూరల్ సిఐ రామకృష్ణ, ఎస్ఐ వెంకట సురేష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముఖి సూర్యనారాయణ, గూడెపు యుగంధర్, చల్ల కనక, కె.సురేష్, కె.పోలినాయుడు, పి.నరసింహారావు, పల్లెడ ఉమామహేశ్వరరావు, సర్పంచ్ లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలో గురువారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శ్రీకారం చుట్టనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ ఎస్.శేఖర్‌పాత్రుడు తెలిపారు. బుధవారం కొమరాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గుణద తీలేసు పంచాయతీలో దిగువ గుణద నుంచి బిన్నిడి, ఎగువ గుణద నుంచి సవర గుణద గ్రామాలకు రూ.4.10 కోట్లతో నిర్మించిన బిటి రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభిస్తారని చెప్పారు. ఉలిపిరి ఆశ్రమ పాఠశాలకు రూ.20 లక్షలతో మంజూరైన ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఉలిపిరివలసలో ప్రాథమిక పాఠశాలకు రూ.12 లక్షలతో నిర్మించిన ప్రహరీ, గుణానపురంలో రూ.14 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభిస్తారని వివరించారు. సాయంత్రం గుణానపురం గ్రామంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు, గ్రామస్తులు

తాగునీటి కోసం

ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి-పాచిపెంట

తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మండలంలోని గొలుగువలస మహిళలు బుధవారం ఖాళీబిందెలతో నిరసన చేపట్టారు. గురువునాయుడుపేట పంచాయతీ గొలుగువలసలో దాదాపు 300 కుటుంబాలు ఉన్నాయని, గత మూడు నెలలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని సుర సన్యాసమ్మ, జన్ని గౌరమ్మ, పాంగి గంగమ్మ, రాయిపల్లి గౌరమ్మ, ఆమెటి మజ్జమ్మ ఆవేదన వ్యక్తంచేశారు. వీరి ఆందోళనకు సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యపై అధికారులు దృష్టిపెట్టి, ముందస్తుగా సమస్య పరిష్కరించాల్సి ఉన్నా, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. అనంతరం మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతిపత్రం అందించారు. మంత్రి స్పందిస్తూ తాగునీటి సమస్య ఎక్కడున్నా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ప్రకృతి వ్యవసాయ జిల్లాగా పార్వతీపురం

- వెయ్యి ఎకరాల్లో పైనాపిల్ సాగు లక్ష్యం
- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో సాధ్యమైనంత వరకు ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయ జిల్లా దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్.. వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో 4,800 ఎకరాల వరకు పైనాపిల్ సాగు చేసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ, కేవలం 250 ఎకరాల విస్తీర్ణంలో సాగు జరగడం పట్ల కలెక్టర్ ఆరా తీశారు. ఈ ఏడాది కనీసం వెయ్యి ఎకరాల్లో పైనాపిల్ సాగు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రాథమిక రంగాల వృద్ధిపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ఎక్కువగా జరుగుతుందని, సేంద్రియ పంటల రైతులను ప్రోత్సహించాలని అన్నారు. నిమ్మగడ్డికి మంచి గిరాకీ ఉందని, అందుకు తగిన ప్రణాళికలు రూపొందించి రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. రెండు వేల ఎకరాల్లో నిమ్మగడ్డిని సాగు చేసేందుకు అవకాశం ఉందని, ప్రస్తుతం 833 ఎకరాల్లో సాగవుతుందని, దాన్ని మరింత పెంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఐదు వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతుందని, అది మరింత పెరగాలని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

జీడి, పసుపు, ఇతర అంతర పంటలపై వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రాథమిక రంగం ద్వారానే జిల్లాలో అధిక శాతం వృద్ధి సాధించేందుకు ఆస్కారం ఉందని స్పష్టంచేశారు. సంబంధిత అధికారులంతా ఆయా శాఖల ద్వారా సాధించగల వృద్ధిపై ప్రణాళికలు సిద్ధం చేసుకొని వచ్చే వారంలోగా నివేదికలను అందించాలని ఆదేశించారు.

పశు సంవర్ధక శాఖ ద్వారా గొర్రెలు, పశువులు, కోళ్ల పెంపకం యూనిట్లను ప్రోత్సహించి జీవనోపాధులు మరింత పెంచాలని కలెక్టర్ సూచించారు. సెరీకల్చర్ క్లస్టర్లు ఏర్పాటుచేయాలని, దానికి మంచి అవకాశాలు ఉన్నాయని అన్నారు. సెరీకల్చర్ క్లస్టర్లను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అవకాశాలు పరిశీలించాలని, తద్వారా ప్రజల్లో ప్రాచుర్యం పొందగలరని చెప్పారు. ఫారం పాండ్స్ ఏర్పాటువల్ల వ్యవసాయ, మత్స్య సంపద సాగుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ఇప్పటివరకు 9 వేల ఫారం పాండ్స్ ప్రారంభిస్తే కొన్ని పూర్తయ్యాయని, ఈ ఏడాది 50 వేల ఫారం పాండ్స్ లక్ష్యం కావాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. 90 గ్రామాల్లో 120 చెక్‌డ్యాములు ప్రారంభించామని, రానున్న రెండు మాసాల్లో అవి పూర్తికావాలని తెలిపారు. ఇకపై ప్రతి అధికారి ప్రతి మూడు మాసాలకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకొని, వాటిని పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యవసాయ అనుబంధ శాఖలు ఎక్స్‌పోజ్ టూర్లను నిర్వహించడం, రైతులకు తగిన శిక్షణ కార్యక్రమాలు ఇవ్వడం ద్వారా వృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని, ఆ దిశగా ఆలోచనలు చేయాలని కలెక్టర్ వివరించారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పట్టు, పశు సంవర్ధక శాఖల అధికారులు కె.రాబర్ట్‌పాల్, బి.శ్యామల, టి.సంతోష్ కుమార్, ఎ.వి.సాల్మన్‌రాజు, ఎస్.మన్మథరావు, డిఆర్‌డిఎ పీడీ సుధారాణి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, ఎల్‌డిఎం ఎన్.విజయ్ స్వరూప్, కెవికె శాస్త్రవేత్త శ్రీనివాసరాజు, జిల్లా అగ్రి ట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్, డిసిఒ పి.శ్రీరామమూర్తి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం ఎంపిడిఒగా రమేష్

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పార్వతీపురం ఎంపిడిఒగా జి.రమేష్ నియమితులయ్యారు. పార్వతీపురం కె.రూపేష్‌కుమార్ కొద్దిరోజులుగా సెలవుపై వెళ్లడంతో రమేష్‌కు పూర్తి అదనపు బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు. ఈ సందర్భంగా రమేష్‌కు కార్యాలయ ఎఒ జి.రమణమూర్తి, సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ఎంఇఒల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఎంఇఒలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు ఎంఇఒల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం కోరారు. బుధవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విశేష ప్రతిభ చూపిన విజయ్‌చంద్రను సత్కరించారు. ఎంఇఒల సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, విద్యా శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీనిచ్చారు.

రెవెన్యూ సదస్సులు 99.34 శాతం పూర్తి

కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జెసి శోబిక, డిఆర్ఒ హేమలత

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో 6,246 రెవెన్యూ సదస్సులకు గాను 6,205 సదస్సులను చేపట్టి 99.34 శాతం మేర పూర్తి చేసినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్.. అడిషనల్ సిసిఎల్ఎకు వివరించారు. రెవెన్యూ సదస్సులు, పిజిఆర్ఎస్, రెగ్యులరైజేషన్, నీటి పన్ను తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో అడిషనల్ సిసిఎల్ఎ, సెక్రటరీ ఎన్.ప్రభాకరరెడ్డి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాల వారీగా ప్రగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంకా 41 రెవిన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉందన్నారు. త్వరలో వాటిని నిర్వహించి శత శాతం పూర్తిచేయనున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇప్పటివరకు 29,778 అర్జీలు రాగా, వాటిలో 29,365 పరిష్కరించినట్లు వెల్లడించారు. మిగిలిన 413 అర్జీలు పరిష్కార దశలో ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ వీడియో సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

కలెక్టరేట్ ఎదుట తమ సమస్యల పరిష్కారం కోసం బుధవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శోభికకు వినత అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ జెఎసి జిల్లా కన్వీనర్ బి.వి.రమణ మాట్లాడారు. పారిశుధ్య నిర్వహణలో సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మున్సిపల్ కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, ఉద్యోగ విరమణ పొందిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. గ్రాట్యుటీ, పింఛను సౌకర్యం కల్పించాలని డిమాండ్‌చేశారు. మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. వేసవి తాపం పెరుగుతుందని, మే, జూన్ నెలల్లో కార్మికులకు పనివేళలు సవరించాలన్నారు.

కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, నాగవంశం మల్లేష్, బంగారు రాజేష్, మామిడి శివ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-పాలకొండ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 84 యూనిట్లకు గాను 296 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మల భాను, వైస్ ఎంపిపి వాకముడి అనిల్, జాడ శ్రీధర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. నగర పంచాయతీలో ఈ సబ్సిడీ రుణాలకు 484 దరఖాస్తులు వచ్చాయి. వాటిని కమిషనర్ టి.జయరామ్, చైర్మన్ పల్లా ప్రతాప్ పరిశీలించారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

కొత్త జిల్లాలకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి, గుర్తింపునివ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడి మూడేళ్లవుతున్నా అభివృద్ధి కానరావడం లేదని చెప్పారు. గెజిట్ నోటిఫికేషన్ ద్వారా గుర్తింపు లేకపోవడం వల్ల కేంద్రం నుంచి నేరుగా జిల్లాకు నిధులు రాని పరిస్థితి నెలకొందని తెలిపారు. పాత జిల్లాకు మంజూరైన నిధులనే కొత్త జిల్లాలకు సర్దుబాటు చేసుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచి కొత్త జిల్లాలకు గెజిట్ నోటిఫికేషన్ జారీ అయ్యేలా చూడాలని కోరారు.

విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి-వీరఘట్టం

కంబరవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి గురాన చరణ్.. నవోదయ ప్రవేశ పరీక్షలో సత్తాచాటి, ఎంపికయ్యాడు. దీంతో ఆ విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు వై.లక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థి తండ్రి గురాన వెంకట రమణమూర్తి ఉన్నారు.

7న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-సీతానగరం

ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలని ఈ నెల ఏడో తేదిన కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ కూలీలకు ఏడు వారాలుగా బిల్లులు చెల్లించక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని ఉపాధి హామీ కూలీలను కోరారు.



మిమ్స్‌లో చిన్నయ్యకు పింఛను అందజేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ వికాస్

ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి-సాలూరురూరల్

మండలంలోని మరిపిల్లి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ జగ్గేన వికాస్ మంచిమనసు చాటుకున్నారు. సచివాలయ పరిధిలో నివశిస్తున్న కొట్టిస చిన్నయ్య.. విజయనగరం జిల్లా నెల్లిమర్ల వద్దనున్న మిమ్స్ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ వికాస్.. బుధవారం మిమ్స్ ఆస్పత్రికి వెళ్లి, అక్కడ చిన్నయ్యకు పింఛను డబ్బులు రూ.10 వేలు అందజేశారు. దీంతో గ్రామస్తులు వికాస్‌ను అభినందించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిపమాక అధికారి సర్వేశ్వరరావు

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో హడ్డుబంగిలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు ఆధ్వర్యాన విద్యార్థులకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలను నివారించే పద్ధతులు, ప్రమాదంలో చిక్కుకొన్న, గాయపడిన వారిని సురక్షిత ప్రదేశానికి తరలించే పద్ధతులపై తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమములో ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలో రెండున్నరేళ్లుగా అసంపూర్తిగా వదిలేసిన రోడ్డును పూర్తి చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం కొమరాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాట్లాడుతూ చోళ్లపదం పంచాయతీ కొండకూనేరు నుండి పెద్దశాఖ పంచాయతీ జల, గుజ్జాబడి గ్రామాలకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టారని తెలిపారు. రెండు చోట్ల ఈ రహదారిని అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు, గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంట్రాక్టర్‌ని రప్పించి వెంటనే ఆ పనులు పూర్తిచేయాలని అధికారులను కోరారు. జల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.

అంగన్వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ సంసిద్ధత

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని పెదగుడబ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ప్రీ స్కూల్ సంసిద్ధత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమం ఉద్దేశాన్ని అంగన్వాడీ కార్యకర్త చింతాడ గౌరమ్మ తెలిపారు. ప్రీ స్కూల్ పిల్లలకు అంగన్వాడీ కేంద్రంలో ఆటపాటల ద్వారా విద్యను నేర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రీస్కూల్ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ హెల్పర్ మంజుల, ఆశా వర్కర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు బిసి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-సీతంపేట

బిసి కార్పొరేషన్ రుణాలకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ టి.కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 186 దరఖాస్తులు అందించినట్లు చెప్పారు. దరఖాస్తుదారులు తమ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

కురుపాం : బిసి కార్పొరేషన్ రుణాలకు ఎంపిడిఒ కార్యాలయం వద్ద గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి తెలిపారు. మండలంలో 125 మంది బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

సాలూరు రూరల్ : బిసి కార్పొరేషన్ రుణాలకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి తెలిపారు. దరఖాస్తుదారులు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు.

మున్సిపాలిటీలో 4న ఇంటర్వ్యూలు

పార్వతీపురం టౌన్ : పలు కార్పొరేషన్ల రుణాలకు ఈ నెల 4న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ రుణాలకు మున్సిపల్ పరిధిలో ఉన్న 15 సచివాలయాల నుంచి 968 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. మెప్మా కార్యాలయానికి శుక్రవారం ఉదయం 10 గంటలకు దరఖాస్తుదారులు రావాలని కోరారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీ పరిధిలో శ్రీకోటదుర్గ ఫిజియోథెరపీ క్లినిక్ ఆవరణలో ఎ.నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన కిమ్స్ ఐకాన్ గుండె వైద్య నిపుణులు డి.వాసుబాబు సుమారు 200 మందికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కుకు ఆదరణ కరువు



- తగ్గుతున్న పర్యాటకులు
- మూలకు చేరిన కొన్ని ఈవెంట్లు
- ఎనిమిది మంది తొలగింపు
- పార్కు అభివృద్ధిపై దృష్టిపెట్టని అధికారులు

'సంపద సృష్టిస్తాం.. ఆదాయాన్ని పంచుతామ'ంటూ ఓ వైపు సిఎం చంద్రబాబునాయుడు... పర్యాటకాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామంటూ మరోవైపు ప్రజాప్రతినిధులు... పర్యాటక రంగం ద్వారా గిరిజనుల ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తామంటూ ఇంకోవైపు అధికారులు.. ప్రతి సమావేశంలోనూ, ప్రతీ కార్యక్రమంలోనూ ఇదే వరుస. ప్రతిసభలోనూ ఈ వ్యాఖ్యలు నిత్యకృత్యమయ్యాయి. ఆచరణకొచ్చే సరికి ఎక్కడా కనిపించడం లేదు. అందుకు నిదర్శనమే సీతంపేటలోని ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కు. పార్కులో ఈవెంట్లు మూతపడటం, రోజురోజుకు పర్యాటకుల సంఖ్య తగ్గుతుండటమే అందుకు కారణం. పార్కు అభివృద్ధి కోసం రూ.1.50 కోట్లను సుమారు 6 నెలల క్రితం ప్రకటించినప్పటికీ ఇప్పటికీ రాలేదు. దానికి తోడు అధికారులు ప్రత్యేక ఆసక్తి చూపనట్లుగా విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఆదాయానికి గండి పడుతోంది.

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేటలోని ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కు అంటే తెలియని వారుండరు. జిల్లా నలుమూలల నుంచే కాదు, రాష్ట్రంతోపాటు తెలంగాణా, ఒడిశా నుంచీ పర్యాటకులు తరలివచ్చేవారు. ఐటిడిఎ ఆధ్వర్యాన 2018లో అప్పటి పిఒ శివశంకర్.. సుమారు మూడున్నర కోట్లతో ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కు ఏర్పాటు చేశారు. సుమారు 54 మందికి ఉపాధి కల్పించారు. ప్రస్తుతం పాత ఈవెంట్లు మూలకు చేరడంతో పాటు కొత్తవి తీసుకురాలేదు. దీంతో పర్యాటకులు పాత సాహస క్రీడలతో విసిగిపోయి పార్కు వైపు తొంగి చూడటం లేదు. అడ్వెంచర్ పార్కులో ఇప్పటికే పారా మోటరింగ్, గగన్ విహార్, అల్ట్రాన్ వెహికల్ మరమ్మతులకు గురై, రెండేళ్లు కావస్తున్నా మరమ్మతులు చేపట్టలేదు. ఎత్తయిన కొండలపై ఉన్న అడలి వ్యూపాయింట్, జగత్ పల్లి రిసార్ట్స్, మెట్టుగూడ, సున్నపు గెడ్డ జలపాతాలు వంటివి పర్యాటకులు సందర్శించడానికి రెండు గిరి విహార్ వాహనాలు ఉండేవి. ప్రస్తుతం అవి కూడా మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ప్రయివేట్ వాహనాలను పర్యాటకులు ఆశ్రయిస్తున్నారు. వాటర్ రోలర్, సుమో ఫైటింగ్ మరమ్మతులకు గురయ్యాయి. లోపల గ్రాస్ కటింగ్ మిషన్ ఏడాదిగా లేకపోవడంతో వేపుగా గడ్డి పెరిగింది. దీంతో ఫొటో దిగడానికి వచ్చిన వారు మొహం చాటేస్తున్నారు.



ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో కరువైన పర్యాటకులు

దృష్టిసారించేనా?

అడ్వెంచర్ పార్కు.. కార్తీక మాసం పిక్నిక్ సీజన్‌తోపాటు సంబంధం లేకుండా పండగలు, సెలవు రోజుల్లోనూ కిటకిటలాడేది. కానీ ఈ ఏడాది ఉగాది రోజు కూడా పర్యాటకులు ఆశించిన స్థాయిలో రాకపోవడం గమనార్హం. అంతేకాకుండా పార్కుకు వచ్చిన ఆదాయంతో పార్కు నిర్వహణతోపాటు ఉన్న సిబ్బందికి కూడా జీతాలు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం మూలకు చేరిన ఈవెంట్ పారామీటర్ పైలెట్లు ఇద్దరు, ఎలక్ట్రీషియన్, గిరి విహార్ వాహనం డ్రైవర్లు ఇద్దరితో సహా ఎనిమిది మందిని తొలగించినట్లు తెలిసింది. అడ్వెంచర్ పార్కును ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షణ చేస్తూ, ప్రతి ఏటా కొత్త ఈవెంట్లు తీసుకొచ్చి, సంక్రాంతి పండగ సమయాల్లో ఫెస్టివల్ నిర్వహిస్తే అడ్వెంచర్ పార్కు వైపు పర్యాటకులు మొగ్గుచూపే అవకాశం ఉంది. దీంతో పార్కుకు పూర్వ వైభవం వస్తుంది.

ప్రతిపాదనలు పంపించాం



ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కు అభివృద్ధికి రూ.1.50 కోట్లతో లక్షలు ప్రతిపాదనలు పంపించాం. కొత్త ఈవెంట్లు తేవడానికి ప్లాన్ చేస్తున్నాం. పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం.

- జి.చినబాబు, ఎపిఒ, సీతంపేట ఐటిడిఎ



ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో మూలకు చేరిన పారా మోటరింగ్, అల్ట్రాన్, గిరివిహార్ వాహనాలు

గిరిశిఖర గ్రామాల్లో
మౌలిక వసతులు కల్పించాలి



ఊటగెడ్డ నుంచి నీరు తీసుకొస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - కురుపాం

గిరిశిఖర గ్రామాలకు ప్రభుత్వం తక్షణమే మౌలిక వసతులను కల్పించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బి. గంగారావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో వలసబల్లేరు పంచాయతీలో చాపరాయిగూడ, బొడ్డగాడిగూడ గిరిజన గ్రామాలను సందర్శించి, అక్కడ గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామాల్లో సుమారు 60 కుటుంబాలు నివసిస్తున్నాయని, నేటికీ మౌలిక వసతులు అందని ద్రాక్షగా ఉన్నాయని చెప్పారు. గతంలో జి.శివడ పంచాయతీ నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టినా, పూర్తిస్థాయిలో చేపట్టక పోవడంతో వాహనాలు రాకపోకలు సాగే పరిస్థితి లేదన్నారు. దీనివల్ల అటవీ ఫలసాయాలు రవాణాకు వీల్లేకుండా పోయిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ గ్రామాలకు ఒకే బావి ఉందని, వేసవి వస్తే బావిలో నీరు ఇంకిపోయి, సుమారు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోని గెడ్డలు, ఊట బావుల నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని వాపోయారు.

గిరిజనుల సమస్యలపై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి గిరిశిఖర గ్రామాలకు కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు బిడ్డక అనిల్, బిడ్డిక రాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. బుధవారం గరుగుబిల్లిలో టిడిపి మండల అధ్యక్షులు ఎ.మధుసూదనరావు అధ్యక్షతన మండల విస్తృత స్థాయి సమావేశం, అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంతలు లేని రోడ్లు వేసి, వాహన చోదకులకు ఉపశమనం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందేటట్టు ప్రభుత్వం చూసుకుంటుందని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలో ప్రతి గ్రామంలోనూ సిసి రోడ్లు, కాలువలు నిర్మించి, గ్రామాల అభివృద్ధికి బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కె.కళావతి, రాష్ట్ర నాయకులు ఎం.పురుషోత్తమ నాయుడు, ఎం.తవిటినాయుడు, అంబటి రాంబాబు, విజయ అంకుశం, కోట సుమన్, ఎడ్ల శ్రీనివాసరావు, ఎం.నారాయణస్వామి, పల్ల పాపినాయుడు, జి.లక్ష్మీనాయుడు, బచ్చా జగదీష్, ఎం.రామారావు, నల్ల తిరుపతినాయుడు, కలమట అరుణ్ కుమార్, ఎం.సింహాచలం, ఆర్.గోవిందరావు, ఎం.నారాయణ స్వామి నాయుడు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలో నాగావళి నదికి అవతల వైపు ఉన్న పొడుగువలసలో రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో టిడిపి మండల కన్వీనర్ శనపతి ఉదయ్ శేఖర్ తన సొంత నిధులతో పొడుగువలస నుంచి రాయగడ జిల్లా ఓనిజ వరకు రోడ్డుపై గుంతలను పూడ్చిపెట్టే కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. జెసిబి సాయంతో మట్టి రోడ్డుపై ఉన్న గుంతలను పూడుస్తున్నారు. దీంతో తమకు రవాణా కష్టాలు తీరుతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.



గుంతల పూడ్చివేతను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు ఉదయ్‌శేఖర్

సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని పులిగుమ్మి సర్పంచ్ బేత బాల కుమారి భర్త వెంకటరమణ అనారోగ్యంతో పది రోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇటీవల స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే కోరారు.



వెంకటరమణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర

ముగిసిన జీవనోపాధుల శిక్షణ

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జీవనోపాధుల శిక్షణ బుధవారం ముగిసింది. ఈ శిక్షణలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు కె.లలిత కుమారి మాట్లాడారు. మండలంలోని 1750 ఎస్‌హెచ్‌జిలు ఉండగా, 10 ఎస్‌హెచ్‌జికు ఒక ఎన్యుమరేటర్ చొప్పున 175 మందిని గుర్తించామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి, మొబైల్ ద్వారా ఈ కార్యక్రమం చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఎపిఎం కె.రాము, ఎఫ్‌పిఒ సిసి వై.ఆనంద్, సిసి మురళి, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఎంఎస్ అధ్యక్షులు లలితకుమారి

పట్టాలు తప్పిన నాగావళి ఎక్స్‌ప్రెస్

- తప్పిన పెను ప్రమాదం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డిఆర్ఎం



సిఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలో పట్టాలు తప్పిన నాగావళి ఎక్స్‌ప్రెస్

ప్రజాశక్తి-విజయనగరం కోట

నాందేడ్ నుంచి సంబల్‌పూర్ వెళ్తున్న నాగావళి (20810) ఎక్స్‌ప్రెస్ బుధవారం ఉదయం విజయనగరంలో పట్టాలు తప్పింది. ఉదయం 11.50 గంటలకు విజయనగరం రైల్వేస్టేషన్‌కు చేరుకున్న రైలు పది నిమిషాలు అనంతరం బయలు దేరింది. స్టేషన్ దాటిన కొద్దిసేపటికే సిఎంఆర్ షాపింగ్‌మాల్ వెనుక (వెంకటలక్ష్మి థియేటర్) సమీపాన హౌరా, రాయపూర్‌లైన్ల క్రాసింగ్ వద్ద చివర గార్డు బోగీతో పాటు మరో రెండు జనరల్ బోగీలు పట్టాలు తప్పాయి. వీటిలో జనరల్ బోగీలు ఉన్నాయి. రైలు నెమ్మదిగా వెళ్లడంతో ప్రాణ నష్టమేమీ జరగలేదు. స్టేషన్ నుంచి బయలుదేరిన క్షణాల్లో రైలు నెమ్మదిగా వెళ్లడంతో ప్రాణ నష్టమేమీ జరగలేదు. ప్రయాణికులకు ఎటువంటి గాయాలూ కాలేదు. వెంటనే రైల్వే అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గురైన బోగీలను రైలు నుంచి తప్పించారు. ఆ రెండు బోగీల్లో ఉన్న వారిని అదే ట్రైన్ లో ఎక్కించి రైలును మధ్యాహ్నం 1.59నిమిషాలకు సంబల్‌పూర్ పంపించారు. వెను వెంటనే రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. అయితే అటు రాయగడ, ఇటు భువనేశ్వర్ రైల్వే క్రాసింగ్ వద్ద ప్రమాదం చోటు చేసుకోవడంతో రైళ్లు విజయనగరం సమీపంలోకి వచ్చేసరికి నెమ్మదిగా నడుస్తున్నాయి. సంఘటనా జరిగిన వెంటనే రైల్వే అధికారులు, రైల్వే, సివిల్ పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. విజయనగరం తహశీల్దార్ కూర్మనాధ్, వన్‌టౌన్ సిఐ శ్రీనివాసరావు తదితరులు సహాయక చర్యలు చేపట్టారు. విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఎలా జరిగిందో అధికారులను అడిగారు. రాయగడ డిఆర్ఎం లలిత్ బోహార్ బుధవారం సాయంత్రం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద ఘటనపై ఆరా తీశారు. ఈ సంఘటనపై ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు డిఆర్ఎం, స్టేషన్ మేనేజర్‌తో మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఆర్ఎం లలిత్‌బోహార్



స్వాధీనం చేసుకున్న బైక్, సారాతో ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు, సిబ్బంది

10 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలం చినమేరంగి గ్రామానికి చెందిన వెలగాడ ప్రభాకరరావు 10 లీటర్ల సారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. సారాతోపాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.